www.bhadradrinews.com

భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

సంపాదించే వ్యక్తి మరణిస్తే

రూ.5 లక్షల బీమా!

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభానికి కలెక్టర్ అంకిత్ ఆదేశాలు

నవంబర్ 19 నుంచి గ్రామ పంచాయతీలు, పట్టణ వార్డుల్లో ప్రత్యేక శిబిరాలు



2

హైదరాబాద్ సంపుటి: 05 సంచిక: 285 శనివారం 14-11-2026 ఎడిటర్ : చెంగపొంగు సైదులు పేజీలు: 05 వెల : 5



రబీ సాగుకు ప్రత్యామ్నాయ

పంటలే మార్గం!

రైతులకు అవగాహన కల్పించి పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించాలి

- **విద్యా ప్రమాణాల పెంపు, భూసేకరణ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలి**
- **అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశాలు**

కొత్తగూడెం, నవంబర్ 13 (భద్రాద్రి న్యూస్):

రాబోయే రబీ సీజన్‌లో తక్కువ నీటి అవసరం ఉండే ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. వ్యవసాయ ప్రణాళికతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాల మెరుగుదల, భూసేకరణ పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించి నిర్దేశిత లక్ష్యాలను సాధించాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అటవీ, వ్యవసాయ శాఖల అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాలపై సమీక్షించారు.

రబీ సాగులో పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం

ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాబోయే రబీ సీజన్‌కు ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. రైతులకు అవసరమైన సాగునీటి సదుపాయాలు కల్పించేందుకు సూక్ష్మసేద్యం, ఉద్యాన శాఖల సమన్వయంతో చర్యలు తీసుకోవాలన్నారు. రైతు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు పంటల వైవిధ్యీకరణను ప్రోత్సహించాలని, కూరగాయల సాగు విస్తీర్ణం పెరిగేలా అవగాహన కల్పించాలని తెలిపారు. రాయితీ విత్తనాల పంపిణీ, మిగతా 2లో..

పదవి హోదా కోసం కాదు..

పేదల కన్నీళ్లు తుడిచేందుకు!



5

- అభాగ్యులకు అండగా సర్పంచ్ లావుడ్యా పూర్ణ..
- తలసేమియా చిన్నారికి, భర్తను కోల్పోయిన మహిళలకు ఆసరా పింఛన్ల మంజూరు
- ప్రజాప్రతినిధిగా బాధ్యతకు మానవీయ స్పర్శ..
- రేగళ్లపెద్దతండాలో సర్పంచ్ సేవలకు ప్రశంసలు
- ప్రతి గడపకూ సంక్షేమమే నా లక్ష్యం : సర్పంచ్ పూర్ణ

అర్హులైన ప్రతి పేదవాడికి

సంక్షేమ ఫలాలు అందిస్తాం

- చేయూత పెన్షన్లు పేదలకు కొండంత అండ
- నియోజకవర్గ సమగ్రాభివృద్ధే నా లక్ష్యం
- సుజాతనగర్ మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



5

సంపాదించే వ్యక్తి మరణిస్తే రూ.5 లక్షల బీమా!

- ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభానికి కలెక్టర్ అంకిత్ ఆదేశాలు
- నవంబర్ 19 నుంచి గ్రామ పంచాయతీలు, పట్టణ వార్డుల్లో ప్రత్యేక శిబిరాలు

కొత్తగూడెం, నవంబర్ 13 (భద్రాద్రి న్యూస్):

కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభానికి జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. నవంబర్ 19న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ పథకం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోనూ ప్రారంభోత్సవ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.

ఈ పథకం ద్వారా కుటుంబంలో సంపాదించే వ్యక్తి లేదా కుటుంబ పెద్ద మరణించిన సందర్భంలో బాధిత కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా ఆర్థిక సహాయం అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించి, వారి జీవన భద్రతకు అండగా నిలవడమే పథకం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

గ్రామ పంచాయతీకి ఒకటి.. వార్డుకు ఒక శిబిరం

నవంబర్ 19 నుంచి పథకానికి సంబంధించిన ప్రత్యేక శిబిరాలు ప్రారంభం కానున్నాయని కలెక్టర్ వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి గ్రామ పంచాయతీకి ఒక శిబిర కేంద్రం, పట్టణ ప్రాంతాల్లో ప్రతి వార్డుకు ఒక శిబిర కేంద్రాన్ని గుర్తించాలని అధికారులకు సూచించారు. శిబిరాల నిర్వహణకు ప్రభుత్వ, సెమీ ప్రభుత్వ భవనాలు, సంస్థల భవనాలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు.

అధికారులకు బాధ్యతలు

గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీడీఓలు, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు తమ పరిధిలో అనువైన శిబిర కేంద్రాలను గుర్తించి, వాటి వివరాలను నవంబర్ 13వ తేదీ ఉదయం లోగా సీపీఓ కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల వివరాలను క్రోడీకరించి హైదరాబాద్‌లోని ఆర్థిక గణాంకాల సంచాలకుల కార్యాలయానికి నిర్ణీత గడువులోగా పంపించనున్నట్లు తెలిపారు.

ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలి

పథకం ప్రారంభానికి ముందే సంబంధిత శాఖల అధికారులు, క్షేత్ర స్థాయి సిబ్బందికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. పథకం లక్ష్యం, ప్రయోజనాలు, అమలు విధానంపై పూర్తి అవగాహన కల్పించడంతో పాటు ప్రజలకు విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. అర్హులైన కుటుంబాలందరికీ పథకం వివరాలు చేరేలా చర్యలు తీసుకోవాలని, నవంబర్ 19 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి ప్రారంభోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.



సామాజిక సేవ లక్ష్యంగా పనిచేయాలి

- డాక్టర్ పంజాల ఐలయ్య

ఖమ్మం ప్రతినిధి, నవంబరు 13 (భద్రాద్రిన్యూస్):-

స్వచ్ఛంద సేవా సంస్థలు సామాజిక సేవ లక్ష్యంగా పనిచేయాలని డాక్టర్ పంజాల ఐలయ్య కోరారు. శుక్రవారం ఖమ్మంలో జరిగిన ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సేవా భావంతో ప్రజలకు సేవలందించి గొప్ప పేరు తీసుకురావాలన్నారు. ఒక ప్రణాళిక బద్ధంగా సేవా కార్యక్రమాలను నిర్వహించాలని ఆయన సూచించారు. అనంతరం ఇటీవల డాక్టరేట్ పొందిన ఐలయ్యను ఘనంగా సత్కరించారు.ఈ సమావేశానికి సంస్థ వ్యవస్థాపకులు వంగూరు వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించగా, లాయర్ విశ్వేశ్వరరావు, టీ శ్రీనివాస్, మహమ్మద్ నాగుల్ తదితరులు పాల్గొన్నారు



ప్రతి కుటుంబానికీ రూ.5 లక్షల బీమా భరోసా!

- కులమతాలు, ఆదాయంతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ బీమా వర్తింపు
- నవంబర్ 19 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నమోదు.. 15 నుంచి 20 రోజుల పాటు ప్రత్యేక శిబిరాలు

కొత్తగూడెం, నవంబర్ 13 (భద్రాద్రి న్యూస్):





రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా తెలంగాణలో నివసించే ప్రతి కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుందని స్పష్టం చేశారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తిని కోల్పోయినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడకుండా అండగా నిలవాలనే మానవీయ ఆలోచనతో ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించిందన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్‌తో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, దేశంలోనే తొలిసారిగా ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించే వినూత్న కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న రాష్ట్రవ్యాప్తంగా పథకాన్ని లాంఛనంగా ప్రారంభించి, అదే రోజు నమోదు ప్రక్రియను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. నవంబర్ 14 నుంచే పథకంపై ప్రచార కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

18 నుంచి 59 ఏళ్లలోపు ఒకరికి బీమా అవకాశం

ఈ పథకం కింద ప్రతి కుటుంబం నుంచి 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన ఒకరిని బీమా పొందే వ్యక్తిగా ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని భట్టి విక్రమార్క వివరించారు. కుటుంబ సభ్యులు తమ ఇష్టానుసారం ఒకరు లేదా పలువురిని నామినీలుగా ఎంపిక చేసుకోవచ్చని, బీమా మొత్తాన్ని ఒకే నామినీకి కేటాయించడంతో పాటు పలువురికి నిర్దేశిత శాతాల ప్రకారం పంపిణీ చేసుకునే వెసులుబాటు ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వం నిర్వహించిన సీపెక్ సర్వేలో సేకరించిన కుటుంబ వివరాలతో పాటు పౌరసరఫరాల శాఖ వద్ద ఉన్న రేషన్ కార్డుల సమాచారాన్ని ఉపయోగించి నమోదు ప్రక్రియ చేపడతామని చెప్పారు. రేషన్ కార్డులు లేని కుటుంబాలు కూడా ఈ పథకానికి అర్హులేనని, వారి వివరాలను ప్రత్యేక భౌతిక దరఖాస్తుల ద్వారా సేకరించాలని సూచించారు.

దరఖాస్తు వివరాలు చదివి వినిపించాలి

నవంబర్ 19 నుంచి గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి కుటుంబాల వివరాలను నమోదు చేయాలని అధికారులకు సూచించారు. బీమా పొందే వ్యక్తి దరఖాస్తుపై తప్పనిసరిగా సంతకం చేయాలని, అందులో నమోదు చేసిన వివరాలు, నామినీల పేర్లు, వారికి కేటాయించిన వాటాలను సంతకం తీసుకునే ముందు పూర్తిగా చదివి వినిపించాలని స్పష్టం చేశారు. తాము ఏ పథకం కోసం దరఖాస్తు చేస్తున్నారో, ఎవరిని నామినీలుగా ఎంపిక చేసుకుంటున్నారో ప్రతి ఒక్కరికీ స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు.

20 రోజులపాటు నమోదు శిబిరాలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ నవంబర్ 19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. దరఖాస్తు విధానాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేసినట్లు వెల్లడించారు. కుటుంబ సభ్యుల వివరాలతో పాటు బీమా పొందే ప్రధాన లబ్ధిదారుడి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్లకు సూచించారు. ఆధార్, బ్యాంకు ఖాతా తదితర అవసరమైన వివరాలను ఇప్పటికే అందుబాటులో ఉన్న ప్రభుత్వ సమాచార వ్యవస్థల ద్వారా సేకరించి నమోదు ప్రక్రియను సులభతరం చేయాలని తెలిపారు.

నవంబర్ 19 నుంచి 15 నుంచి 20 రోజుల పాటు శిబిరాల విధానంలో నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీరాజ్ శాఖ, పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో అవసరమైన సంఖ్యలో నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

17, 18 తేదీల్లో విస్తృత ప్రచారం

నవంబర్ 17, 18 తేదీల్లో అన్ని గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని, శిబిరాలు జరిగే ప్రదేశం, సమయాన్ని ముందుగానే ప్రజలకు తెలియజేయాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి ఇంటికీ పథకం సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పథకం అమలులో కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ప్రయోజనం అందేలా చూడాలని పిలుపునిచ్చారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరం నుంచి అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, సీపీఓ జె. సునీత తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

రబీ సాగుకు ప్రత్యామ్నాయ పంటలే మార్గం!

మొదటిపేజీ తరువాయి

పంటల మార్పిడి, సూక్ష్మసేద్య పరికరాల వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు పెరగాలి

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్రస్థాయిలో విద్యార్థుల సగటు హాజరు 73.74 శాతం ఉండగా, జిల్లా స్థాయిలో 72.21 శాతంగా నమోదైందని తెలిపారు. ఉపాధ్యాయుల హాజరు రాష్ట్రస్థాయిలో 87.06 శాతం, జిల్లా స్థాయిలో 88.05 శాతంగా ఉందని వివరించారు. ఉపాధ్యాయుల హాజరుకు అనుగుణంగా విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫామ్‌ల వినియోగాన్ని పెంచాలని, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలు, గురుకులాలు, ఇతర ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. కలెక్టర్లు క్రమం తప్పకుండా పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు, విద్యాబోధన, మౌలిక సదుపాయాలను పరిశీలించాలని, సమగ్ర శిక్షా పథకం కింద చేపట్టిన నిర్మాణ పనుల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు.

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల లక్ష్యాలను సాధించేలా చర్యలు తీసుకోవాలని ప్రధాన కార్యదర్శి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 96 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 11,520 సీట్లకు గాను 7,107 ప్రవేశాలు నమోదై 61.69 శాతం సీట్లు భర్తీ అయినట్లు వివరించారు. మిగిలిన సీట్లను భర్తీ చేయడంతో పాటు కళాశాలల్లో ఎఫ్‌ఆర్ఎస్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ, రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ పరిధిలో చేపడుతున్న భూసేకరణ పనుల పురోగతిని సమీక్షించారు. భూసేకరణలో అవార్డుల జారీ, పరిహారం పంపిణీ, భూముల స్వాధీనం మధ్య ఉన్న వ్యత్యాసాలను





తగ్గించాలని సూచించారు. అర్హులైన భూయజమానులకు పరిహారం త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటూ భూసేకరణ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

వీధి కుక్కల నియంత్రణకు సంబంధించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని, గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాల ఏర్పాటుతో పాటు జిల్లా స్థాయి కమిటీల ద్వారా కార్యకమాల అమలును పర్యవేక్షించాలని సూచించారు.

జిల్లాలో ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో జిల్లాలో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. రబీ సాగులో తక్కువ నీటి అవసరం ఉండే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించడంతో పాటు రాయితీ విత్తనాల పంపిణీ, పంటల వైవిధ్యీకరణపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.

జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థలను సంబంధిత అధికారుల సమన్వయంతో క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నామని, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థుల సంఖ్య పెంపొందించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని కలెక్టర్ వివరించారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్, అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, సీపీఓ జె. సునీత, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లకు పోలీసుల షాక్.. రూ.4.97 లక్షల సొమ్ముకు భద్రత!

- **సైబర్ నేరగాళ్లకు పోలీసుల షాక్.. రూ.4.97 లక్షల సొమ్ముకు భద్రత!**
- **బాధితుడికి రూ.1.62 లక్షలు రిఫండ్.. మరో రూ.3.35 లక్షలు హోల్డ్ ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేక పర్యవేక్షణలో సైబర్ క్రైమ్ సెల్ వేగవంతమైన చర్యలు**

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 13 (భద్రాద్రి న్యూస్):

క్రెడిట్ కార్డు సైబర్ మోసంలో రూ.4,97,526 కోల్పోయిన బాధితుడికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు అండగా నిలిచారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ప్రత్యేక పర్యవేక్షణలో సైబర్ క్రైమ్ సెల్ అధికారులు వేగంగా స్పందించి బాధితుడి నగదుకు భద్రత కల్పించారు. ఇందులో రూ.1,62,470 బాధితుడి ఖాతాలోకి తిరిగి జమ చేయించగా, మరో రూ.3,35,056ను సంబంధిత బ్యాంకు ఖాతాల్లో నిలిపివేయించారు.

అశ్వాపురం పరిధిలోని హెవీ వాటర్ ప్లాంట్‌లో పనిచేస్తున్న సుశీల్ కుమార్ అనే వ్యక్తి క్రెడిట్ కార్డు నుంచి ఈ నెల 8వ తేదీన నాలుగు విడతల్లో సైబర్ నేరగాళ్లు రూ.4,97,526 కాజేశారు. వెంటనే అప్రమత్తమైన బాధితుడు జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ 1930కు ఫిర్యాదు చేశాడు.

ఫిర్యాదు అందిన వెంటనే జిల్లా సైబర్ క్రైమ్ సెల్ అధికారులు స్పందించి లావాదేవీలను పరిశీలించారు. సంబంధిత బ్యాంకు అధికారులతో సమన్వయం చేసుకుంటూ నగదు బదిలీ అయిన ఖాతాలను గుర్తించి నిలువరించేందుకు చర్యలు చేపట్టారు. ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాలతో ప్రత్యేక దృష్టి సారించి రూ.1,62,470ను బాధితుడికి రిఫండ్ చేయించడంతో పాటు మరో రూ.3,35,056ను బ్యాంకు ఖాతాల్లో హోల్డ్ చేయించారు. దీంతో బాధితుడికి చెందిన మొత్తం రూ.4,97,526 సొమ్ముకు భద్రత లభించింది.

అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

ఘటనపై ఈ నెల 9వ తేదీన అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 162/2026గా బీఎన్ఎస్ సెక్షన్ 318(4), ఐటీ చట్టంలోని 66(C), 66(D) సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ కె. నరేష్, ఎస్ఐ ఎస్.కే. జుబేదా, సిబ్బంది డి. వంశీకృష్ణ, బి. శ్రావణ్ కుమార్, వి. రజిత, సుప్రియ సమన్వయంతో పనిచేసి బాధితుడి సొమ్మును సురక్షితం చేయడంలో కీలక పాత్ర పోషించారు.



గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేయాలి

సైబర్ మోసాలకు గురైన బాధితులు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. మోసం జరిగిన వెంటనే, ముఖ్యంగా గోల్డెన్ అవర్‌లో ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలువరించే, తిరిగి పొందే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. అపరిచిత లింకులను క్లిక్ చేయడం, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలను ఇతరులకు వెల్లడించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులు సిద్ధం కావాలి!

- **ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగులో ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి**
- **రెగళ్లలో రైతులకు అవగాహన కల్పించిన ఉద్యాన శాఖ అధికారులు, కేవీకే శాస్త్రవేత్త**

లక్ష్మీదేవి పల్లి, నవంబర్ 13 (భద్రాద్రి న్యూస్):



వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగులో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి జె. కిషోర్ సూచించారు. లక్ష్మీదేవిపల్లి మండలం రెగళ్ల గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా జె. కిషోర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో మార్పులు, నీటి ఎద్దడి వంటి పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల యాజమాన్య పద్ధతులను సమర్థవంతంగా పాటించాలని సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటల సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కేవీకే శాస్త్రవేత్త టి. భరత్ మాట్లాడుతూ ఉద్యాన పంటలపై ఎల్‌నినో ప్రభావం, నీటి యాజమాన్యం, మల్చింగ్, సూక్ష్మసేద్యం, పంటల సంరక్షణ వంటి శాస్త్రీయ విధానాలను వివరించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు పద్ధతుల్లో మార్పులు చేసుకోవాలని రైతులకు సూచించారు.

ఆయిల్‌పామ్ సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు

ఆయిల్‌పామ్ సాగులో మొక్కల పెంపకం, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, అంతర పంటల సాగు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖ ద్వారా అమలవుతున్న వివిధ ప్రభుత్వ పథకాలు, రైతులకు అందించే రాయితీలు, వాటిని సద్వినియోగం చేసుకునే విధానాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి జె. కిషోర్, కేవీకే శాస్త్రవేత్త టి. భరత్, గ్రామ సర్పంచ్, ఉద్యాన అధికారి బి. శ్రావంతి, ఉద్యాన విస్తరణ అధికారి ఎం. వసంత, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రైతులు ఆయిల్‌పామ్ సాగు, ఉద్యాన పంటల యాజమాన్య పద్ధతులు, ప్రభుత్వ పథకాలపై తమ సందేహాలను అధికారులను అడిగి తెలుసుకుని నివృత్తి చేసుకున్నారు.

ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రైతులు సిద్ధం కావాలి!

- **ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగులో ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి**
- **రెగళ్లలో రైతులకు అవగాహన కల్పించిన ఉద్యాన శాఖ అధికారులు, కేవీకే శాస్త్రవేత్త**

లక్ష్మీదేవి పల్లి, నవంబర్ 13 (భద్రాద్రి న్యూస్):



వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్ సాగులో ఎదురయ్యే సమస్యలను అధిగమించేందుకు రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి జె. కిషోర్ సూచించారు. లక్ష్మీదేవిపల్లి మండలం రెగళ్ల గ్రామంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా జె. కిషోర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో అధిక ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో మార్పులు, నీటి ఎద్దడి వంటి పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని రైతులు పంటల యాజమాన్య పద్ధతులను సమర్థవంతంగా పాటించాలని సూచించారు. నీటి లభ్యతను బట్టి పంటల సంరక్షణ చర్యలు చేపట్టాలని తెలిపారు. కేవీకే శాస్త్రవేత్త టి. భరత్ మాట్లాడుతూ ఉద్యాన పంటలపై ఎల్‌నినో ప్రభావం, నీటి యాజమాన్యం, మల్చింగ్, సూక్ష్మసేద్యం, పంటల సంరక్షణ వంటి శాస్త్రీయ విధానాలను వివరించారు. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సాగు పద్ధతుల్లో మార్పులు చేసుకోవాలని రైతులకు సూచించారు.

ఆయిల్‌పామ్ సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు

ఆయిల్‌పామ్ సాగులో మొక్కల పెంపకం, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, అంతర పంటల సాగు, చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఉద్యాన శాఖ ద్వారా అమలవుతున్న వివిధ ప్రభుత్వ పథకాలు, రైతులకు అందించే రాయితీలు, వాటిని సద్వినియోగం చేసుకునే విధానాలను వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల అధికారి జె. కిషోర్, కేవీకే శాస్త్రవేత్త టి. భరత్, గ్రామ సర్పంచ్, ఉద్యాన అధికారి బి. శ్రావంతి, ఉద్యాన విస్తరణ అధికారి ఎం. వసంత, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రైతులు ఆయిల్‌పామ్ సాగు, ఉద్యాన పంటల యాజమాన్య పద్ధతులు, ప్రభుత్వ పథకాలపై తమ సందేహాలను అధికారులను అడిగి తెలుసుకుని నివృత్తి చేసుకున్నారు.

ఏడవ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ముదిగొండ, నవంబర్ 13(భద్రాద్రి న్యూస్):-

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టియస్ యుటిఎఫ్) ఏడవ జిల్లా ద్వైవార్షిక విద్యా మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్.రంజాన్, పారుపల్లి నాగేశ్వరరావు ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. స్థానిక నవతేజ ఫంక్షన్ హాల్ నందు శుక్రవారం ప్రెస్ మీట్ నిర్వహించనైనది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15, 16 తేదీల్లో మహాసభలు నవతేజ ఫంక్షన్ హాల్ ముదిగొండలో జరుగుతాయని ఈ సందర్భంగా భారత రాజ్యాంగం ఎన్నికల కమిషన్ సర్ అనే అంశంపై ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు ప్రసంగిస్తారని, జాతీయ విద్యా విధానం అమలు పాఠశాలలు, ఉపాధ్యాయులపై ప్రభావం గురించి ఓయూ ప్రొఫెసర్ ఆమంచి నాగేశ్వర్ ప్రసంగిస్తారని, ప్రభుత్వ విద్యారంగంఉపాధ్యాయ సమస్యలు ప్రభుత్వ వైఖరి అనే అంశంపై టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావ రవి ప్రసంగిస్తారని తెలియజేశారు.స్థానిక ముదిగొండ హైస్కూల్ నుండి ఫంక్షన్ హాల్ వరకు వేలాది మంది ఉపాధ్యాయులచే మహా ప్రదర్శన ఉంటుందని, సీనియర్ నాయకులచే పతాకావిష్కరణలు,అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించిన తర్వాత ప్రారంభ సమావేశం నిర్వహిస్తామని ,ప్రారంభ సమావేశంలో రాష్ట్ర మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ.రవి,ఎ. వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరౌతారని, రాష్ట్ర ,జిల్లా నాయకులు మహాసభల్లో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమం గురించి ప్రసంగిస్తారని, ప్రభుత్వ విద్యారంగ పటిష్టత ,ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం చర్చలు చేసి తీర్మానాలు చేస్తామని తెలిపారు.సిపియస్ విధానం రద్దు చేయాలని, పిఆర్సీ అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. వందలాదిగా ఉపాధ్యాయులు హాజరై విద్యా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయస్ యుటిఎఫ్ ఏడోవ జిల్లా మహాసభలు ఆహ్వాన సంఘం అధ్యక్షులు నెల్లూరి వీరబాబు, కార్యదర్శి పెనమాక సురేష్ మండల అధ్యక్షులు వాసం రాంబాబు, సుకాసి సుధాకర్ రావు మండల నాయకులు విజయ్ తదితరులు పాల్గొన్నారు



కార్తికమాస పూజలకు పాల్వంచ అయ్యప్ప ఆలయం ముస్తాబు

- **17 నుంచి మండల పూజలు ప్రారంభం.. 28న మహోత్సవం, నిప్పులపై నడక**
- **కార్తికమాస విశేష పూజల్లో అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి: ఆలయ అధ్యక్షులు కొత్వాల**

పాల్వంచ, నవంబర్ 13 (భద్రాద్రి న్యూస్):

తెలంగాణ రాష్ట్రంలోనే పేరొందిన పాల్వంచ అయ్యప్పస్వామి దేవాలయంలో కార్తికమాసం సందర్భంగా నిర్వహించనున్న విశేష పూజల్లో అయ్యప్ప దీక్షాస్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అధ్యక్షులు, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు.

కార్తికమాస ప్రత్యేక పూజలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులు విడుదల చేశారు. ఈ సందర్భంగా దేవస్థాన అర్చకులు మాధవన్ నంబూద్రి, బృందావనం నర్సింహమూర్తి కరపత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. ఈ నెల 17వ తేదీన అయ్యప్ప స్వామి మండల పూజల ప్రారంభోత్సవం, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 22వ తేదీన రుద్రహోమం, 24వ తేదీన కార్తిక పౌర్ణమి సందర్భంగా లక్షదీపార్చన నిర్వహిస్తామన్నారు. అలాగే 28వ తేదీన మండల పూజ మహోత్సవం, బలిపీఠ పూజ, మహాప్రసాద వితరణ, నగర సంకీర్తన, నిప్పులపై నడక కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. డిసెంబర్ 4వ తేదీన ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ట్రస్ట్ సభ్యులు కాల్వ భాస్కరరావు, మేడిద సంతోష్‌గౌడ్, కనగాల రాంబాబు, బండెల శ్రీనివాస్, బేతంశెట్టి వెంకట్, పి. నరహరి, మాదిరాజు సంతోష్, గౌతమ్, పవన్, ఫారెస్ట్ ప్రసాద్, కంచర్ల రామారావు తదితరులు పాల్గొన్నారు.



మావోయిస్టు ప్రభావం నుంచి అభివృద్ధి బాటలో భద్రాద్రి!

- **12 ఏళ్లలో 829 మంది మావోయిస్టుల అరెస్టు.. 918 మంది లొంగుబాటు**
- **హింసకు స్వస్తి పలికిన వారికి పునరావాసం.. మారుమూల గ్రామాల్లో అభివృద్ధి, ఉపాధి, సంక్షేమానికి ప్రాధాన్యం**

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 13 (భద్రాద్రి న్యూస్):-





ఒకప్పుడు మావోయిస్టు కార్యకలాపాలకు కేంద్రంగా ఉన్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రమంగా అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. మావోయిస్టు కార్యకలాపాల నియంత్రణ, లొంగుబాట్లు, పునరావాసం, మారుమూల ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా పోలీసు యంత్రాంగం చేపడుతున్న చర్యలతో జిల్లాలో పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయని పోలీసు అధికారులు వెల్లడించారు. నక్సల్ ముక్త్ భారత్ అంశంపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు యంత్రాంగం, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ పరిధిలోని పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ) సంయుక్తంగా శుక్రవారం జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో మీడియా సదస్సు నిర్వహించాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇంటెలిజెన్స్ విభాగం ఎస్పీ సింధు శర్మ ఐపీఎస్, పీఐబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లాలో గతంలో చోటుచేసుకున్న మావోయిస్టు కార్యకలాపాలు, అరెస్టులు, లొంగుబాట్లు, పోలీసులపై దాడులు, హింసాత్మక ఘటనల్లో జరిగిన ప్రాణనష్టం, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై మీడియా ప్రతినిధులకు వివరించారు.

12 ఏళ్లలో 829 మంది అరెస్టు..
918 మంది లొంగుబాటు

2014 నుంచి 2026 వరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలో 829 మంది మావోయిస్టులను అరెస్టు చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఇదే కాలంలో పోలీసులకు, మావోయిస్టులకు మధ్య 27 ఎదురు కాల్పుల ఘటనలు చోటుచేసుకోగా 57 మంది మావోయిస్టులు మరణించినట్లు తెలిపారు. మరోవైపు పోలీసుల చర్యలు, ప్రజల్లో అవగాహన, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, పునరావాస చర్యల నేపథ్యంలో 918 మంది మావోయిస్టులు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసినట్లు వివరించారు.

మావోయిస్టు హింసతో భారీ ప్రాణనష్టం

గతంలో మావోయిస్టులు పోలీస్ స్టేషన్లపై దాడులు, రహదారులు, వంతెనలపై మందుపాతరలు అమర్చడం, పేలుళ్లకు పాల్పడటం వంటి హింసాత్మక చర్యలకు పాల్పడినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఘటనల్లో 868 మంది సామాన్య పౌరులు, 331 మంది పోలీసు సిబ్బంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. రహదారులు, వంతెనలు ధ్వంసం కావడంతో మారుమూల గ్రామాల ప్రజలు రవాణా, వైద్యం, విద్య వంటి కనీస సదుపాయాలకు దూరమై ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు.

లొంగుబాటుదారులకు పునరావాస భరోసా

హింసాత్మక మార్గాలను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలోకి వచ్చిన వారికి ప్రభుత్వం పునరావాస విధానం ద్వారా సహాయ సహకారాలు అందిస్తోందని అధికారులు తెలిపారు. ఈ విధానంలో భాగంగా వ్యవసాయ భూమి, ఇంటి స్థలం, ఆర్థిక సహాయం, ఆయుధాలతో లొంగిపోయిన వారికి అదనపు ప్రోత్సాహక సహాయం అందించే వెసులుబాటు ఉందన్నారు.
మీడియా సదస్సుకు హాజరైన పలువురు మాజీ మావోయిస్టులు తమకు ప్రభుత్వం కల్పించిన వ్యవసాయ భూమి, ఇంటి స్థలం, ఆర్థిక సహాయం, స్వయం ఉపాధి అవకాశాల గురించి వివరించారు. హింసను విడిచిపెట్టి సాధారణ జీవితంలోకి వచ్చిన తర్వాత తమ జీవితాల్లో వచ్చిన మార్పులను మీడియా ప్రతినిధులతో పంచుకున్నారు.

మారుమూల గ్రామాలకు అభివృద్ధి వెలుగులు

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు రహదారులు, బీటీ రోడ్ల నిర్మాణం, గ్రామాలకు రవాణా అనుసంధానం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు అధికారులు తెలిపారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, స్వయం ఉపాధిని ప్రోత్సహించడం, చిన్న పరిశ్రమలు, రైస్ మిల్లుల ఏర్పాటుకు సహకారం అందించడం వంటి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు.
విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, స్టడీ మెటీరియల్, క్రీడా సామగ్రి పంపిణీ చేస్తూ విద్యా, క్రీడా రంగాలను ప్రోత్సహిస్తున్నారు. మారుమూల గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ఉచిత వైద్య సేవలు, మందులు అందిస్తున్నారు. తాగునీటి కోసం బోర్‌వెల్స్ ఏర్పాటు చేయడంతో పాటు వరద బాధిత కుటుంబాలకు దుప్పట్లు, నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నారు.క్రీడా పోటీలు, కమ్యూనిటీ అవుట్‌రీచ్ కార్యక్రమాల ద్వారా యువతను సానుకూల కార్యకలాపాల వైపు ప్రోత్సహిస్తూ ప్రజలకు పోలీసు యంత్రాంగం మరింత చేరువయ్యేలా చర్యలు కొనసాగిస్తున్నట్లు అధికారులు వివరించారు.

ఒకేసారి 4.50 లక్షల మందికి కొత్త పెన్షన్లు.. చారిత్రాత్మకం

- **ఆరు గ్యారెంటీల్లో మరో హామీని అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం**
- **పాల్వంచలో 1,387 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ.. ఎమ్మెల్యే కూనంనేనితో కలిసి పాల్గొన్న కొత్వాల**

పాల్వంచ, నవంబర్ 13 (భద్రాద్రి న్యూస్):

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒకేసారి 4.50 లక్షల మంది లబ్ధిదారులకు కొత్త చేయూత పెన్షన్లు మంజూరు చేయడం చారిత్రాత్మకమని డీసీఎంఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు.
శుక్రవారం పాల్వంచ మండలం జగన్నాథపురంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో కొత్తగా మంజూరైన చేయూత పెన్షన్ల పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పాల్వంచ మండల పరిధిలోని 468 మందికి, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 919 మందికి కలిపి మొత్తం 1,387 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి కొత్వాల పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో భాగంగా కొత్త పెన్షన్లను మంజూరు చేసి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు తదితర అర్హులైన లబ్ధిదారులకు ఒకేసారి 4.50 లక్షల పెన్షన్లు మంజూరు చేయడం దేశ చరిత్రలోనే రికార్డుగా ఆయన అభివర్ణించారు.
మంజూరు పత్రాలు అందుకున్న ప్రతి లబ్ధిదారుడి బ్యాంకు ఖాతాలో ఈ నెల 19వ తేదీన పెన్షన్ నగదు జమ అవుతుందని తెలిపారు. ఆర్థికంగా అండగా నిలుస్తున్న ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతతో ఉండాలని కొత్వాల పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడు గణేష్, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, సర్పంచులు, మహిళలు, పెన్షన్ లబ్ధిదారులు పాల్గొన్నారు.





పదవి హోదా కోసం కాదు.. పేదల కన్నీళ్లు తుడిచేందుకు!

- **అభాగ్యులకు అండగా సర్పంచ్ లావుడ్యా పూర్ణ..**
- **తలసేమియా చిన్నారికి, భర్తను కోల్పోయిన మహిళలకు ఆసరా పింఛన్ల మంజూరు**
- **ప్రజాప్రతినిధిగా బాధ్యతకు మానవీయ స్పర్శ..**
- **రేగళ్లపెద్దతండాలో సర్పంచ్ సేవలకు ప్రశంసలు**
- **ప్రతి గడపకూ సంక్షేమమే నా లక్ష్యం : సర్పంచ్ పూర్ణ**

లక్ష్మీదేవిపల్లి , నవంబర్ 13 (భద్రాద్రి న్యూస్):-

పదవి అంటే అధికారం చెలాయించడం కాదు.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం.. పేదల కన్నీళ్లు తుడవడం.. నిస్సహాయుల జీవితాల్లో భరోసా నింపడం. ప్రజాప్రతినిధిగా తనకు లభించిన బాధ్యతను సేవగా భావిస్తూ రేగళ్లపెద్దతండా సర్పంచ్ లావుడ్యా పూర్ణ ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు చేరవేయడమే కాకుండా, ఆపన్నులకు అండగా నిలుస్తూ తనలోని మానవీయ కోణాన్ని చాటుకుంటున్నారు.
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలం రేగళ్లపెద్దతండాలో సర్పంచ్ లావుడ్యా పూర్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజాదర్బార్ ఇందుకు నిదర్శనంగా నిలిచింది. గ్రామంలోని పేదలు, నిరుపేద కుటుంబాలు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి ఇబ్బందులను స్వయంగా తెలుసుకొని సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 17 మంది నుంచి దరఖాస్తులు స్వీకరించగా, 14 మందికి పింఛన్లు మంజూరయ్యేలా చొరవ తీసుకున్నారు.
ఈ కార్యక్రమంలో అందరి హృదయాలను కదిలించిన అంశం తలసేమియా వ్యాధితో బాధపడుతున్న తొమ్మిదేళ్ల చిన్నారి పూసం లిఖితకు ఆసరా పింఛన్ మంజూరు చేయించడం. చిన్న వయసులోనే ప్రాణాంతక వ్యాధితో పోరాడుతున్న ఆ చిన్నారి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడం ద్వారా సర్పంచ్ తన మానవత్వాన్ని చాటుకున్నారు. అలాగే వివాహమైన కొద్ది కాలానికే భర్తను కోల్పోయి 27 ఏళ్ల వయసులోనే జీవిత పోరాటం చేస్తున్న తేజావత్ పావనికి పింఛన్ మంజూరు చేయించి అండగా నిలిచారు. భర్తను కోల్పోయి పేదరికంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అజ్మీరా ద్వాలీకి సైతం పింఛన్ మంజూరు చేయించి ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. ఇలా కష్టాల్లో ఉన్నవారి బాధలను గుర్తించి, వారికి ప్రభుత్వ సాయం అందేలా చొరవ చూపడం గ్రామస్థుల ప్రశంసలు అందుకుంటున్నారు.
సాధారణంగా సంక్షేమ పథకాల కోసం అర్హులు కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఇబ్బందులు పడుతుంటారు. అలాంటి పరిస్థితి రాకుండా ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడం, అర్హత ఉన్నవారికి పథకాలు అందేలా కృషి చేయడం ద్వారా 'గడపగడపకూ సంక్షేమం' అనే లక్ష్యంతో సర్పంచ్ ముందుకు సాగుతున్నారు. ప్రజాప్రతినిధి అంటే ప్రజలకు అందుబాటులో ఉండి, వారి కష్టసుఖాల్లో భాగస్వామి కావాలనే సందేశాన్ని తన సేవల ద్వారా చాటుతున్నారు. అనంతరం సర్పంచ్ పూర్ణ మాట్లాడుతూ..ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నానని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తానని భరోసా కల్పించారు. ప్రజా ప్రభుత్వంలో సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో నిరుపేదలకు సమస్త స్థానం కల్పిస్తున్నారని అందులో భాగంగానే ఇంద్ర మేలు ఆసరా పింఛన్లు వంటి ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ వారికి ఆత్మస్థైర్యంతో జీవించేలా చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భూక్యా సునీత, వార్డు సభ్యులు గొగ్గెల సుధీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు భూక్యా సీతారాం, భూక్యా సుమన్, నూనావత్ నర్సింగ్, ధరావత్ విష్ణుకుమార్, పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్, పంచాయతీ సిబ్బంది బానోత్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.





మంత్రి పొంగులేటికి చిత్తారు వారి వివాహ ఆహ్వానం

- **స్వగృహంలో కలిసి వివాహ పత్రిక అందజేసిన మేకల మల్లిబాబు యాదవ్, చిత్తూరు సింహాద్రి యాదవ్**
- **నూతన వధూవరులను ఆశీర్వదించేందుకు తప్పకుండా వస్తానన్న మంత్రి పొంగులేటి**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 13 (భద్రాద్రి న్యూస్):-

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఖమ్మంలోని ఆయన స్వగృహంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా యువజన అధ్యక్షుడు చిత్తూరు సింహాద్రి యాదవ్, డీసీసీబీ డైరెక్టర్, మంత్రి ప్రధాన అనుచరుడు మేకల మల్లిబాబు యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈ నెల 15వ తేదీ ఆదివారం బోనకల్ రోడ్డులోని లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న చిత్తూరు సింహాద్రి యాదవ్ - మాధవి దంపతుల కుమార్తె జోషిత, గురునాథ్ వివాహ వేడుకకు సంబంధించిన ఆహ్వాన పత్రికను మంత్రికి అందజేశారు. వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు. దీనిపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పందిస్తూ, ఎన్ని కార్యక్రమాలు ఉన్నప్పటికీ తప్పకుండా వివాహానికి హాజరై నూతన జంటను ఆశీర్వదిస్తానని హామీ ఇచ్చినట్లు మేకల మల్లిబాబు యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్నెబోయిన సీతారామయ్య, బొర్రా రాజశేఖర్, ఉన్నం బ్రహ్మయ్య, ప్రతాప్, తుప్పాటి రవి, పొట్లపల్లి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



విలీన మండలాలకు శాశ్వత న్యాయస్థానం ఏర్పాటు చేయాలి

- **చింతూరు లేదా ఎటపాకలో రెగ్యులర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు మంజూరు చేయాలని వినతి**
- **హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్ జనరల్‌కు వినతిపత్రాలు సమర్పించిన న్యాయవాదుల సంఘం**

భద్రాచలం, నవంబర్ 13 (భద్రాద్రి న్యూస్):

పోలవరం జిల్లాలోని విలీన మండలాల ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు చింతూరు లేదా ఎటపాక మండల కేంద్రంలో శాశ్వతంగా రెగ్యులర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును ఏర్పాటు చేయాలని విలీన మండలాల న్యాయవాదుల సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు గౌరవ న్యాయమూర్తులు జస్టిస్ ఎన్. హరినాథ్, జస్టిస్ బట్టు దేవానంద్‌తో పాటు రాష్ట్ర అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్‌కు అధికారికంగా వినతిపత్రాలు సమర్పించారు.

పోలవరం జిల్లాలోని చింతూరు, ఎటపాక, కూనవరం, వి.ఆర్.పురం మండలాలు ఆంధ్రప్రదేశ్‌లో విలీనమైనప్పటి నుంచి స్థానికంగా శాశ్వత న్యాయస్థానం లేకపోవడంతో ప్రజలు, ముఖ్యంగా గిరిజన కక్షిదారులు, సాక్షులు, న్యాయవాదులు కోర్టు విచారణల కోసం సుదూర ప్రాంతాలకు ప్రయాణించాల్సి వస్తోందని వారు వివరించారు. దీనివల్ల తీవ్ర ఆర్థిక భారం పడటంతో పాటు రోజువారీ కూలీ పనులు కోల్పోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

న్యాయస్థానం అందుబాటులో లేకపోవడం వల్ల కేసుల విచారణలో జాప్యం జరుగుతోందని, నాలుగు మండలాలకు రవాణా సౌకర్యం ఉన్న చింతూరు రెవెన్యూ డివిజనల్ కేంద్రంలో లేదా ఎటపాక మండల కేంద్రంలో పూర్తిస్థాయి రెగ్యులర్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టును వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన ప్రాంత ప్రజలకు వారి గడప వద్దకే సత్వర న్యాయం అందించేలా ప్రభుత్వం, న్యాయశాఖ చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ అధ్యక్షులు కొడాలి శ్రీనివాసన్, ప్రధాన కార్యదర్శి పూసాల శ్రీనివాసాచారి, విలీన మండలాల న్యాయవాదుల సంఘం సభ్యులు పేరాల నాగరాజు, పామరాజు తిరుమలరావు, వలవల సురేష్ కుమార్, కొత్తపల్లి రాంబాబు, విజ్జగిరి రవితేజ, సున్నం వెంకటరమణ, మోసం సంజీవరావు తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.



అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందిస్తాం

- **చేయూత పెన్షన్లు పేదలకు కొండంత అండ**
- **నియోజకవర్గ సమగ్రాభివృద్ధే నా లక్ష్యం**
- **సుజాతనగర్ మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి**
- **కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**

సుజాతనగర్, అక్టోబర్ 13 (భద్రాద్రి న్యూస్) :

అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందాలని, ఆసరా లేని వారికి చేయూత పెన్షన్లు కొండంత అండగా నిలుస్తాయని కొత్తగూడెం శాసన సభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. సుజాతనగర్ మండలంలో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు కొత్తగా మంజూరైన 228 చేయూత పెన్షన్ల మంజూరు పత్రాలను శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న నిరుపేద కుటుంబాలకు నెలవారీ పెన్షన్ ఎంతో భరోసానిస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్షకు తావులేకుండా అర్హులందరికీ న్యాయం జరిగేలా చూస్తున్నామన్నారు. సుజాతనగర్ మండల సమగ్రాభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తున్నానని, ముఖ్యంగా గ్రామాల్లో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి వసతుల కల్పనతో పాటు, రైతులకు సాగునీరు, విద్య, వైద్య రంగాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు శాయశక్తులా పనిచేస్తున్నానని, ప్రజలకు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు.



చేయూత పెన్షన్లతో పేదలకు ఆర్థిక భరోసా

- **అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ ఫలాలు అందించడమే ప్రజా పాలన లక్ష్యం**
- **ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కకు 58వ డివిజన్ కార్పొరేటర్ మొహమ్మద్ దావూద్ కృతజ్ఞతలు**

కొత్తగూడెం అర్బన్ ,నవంబర్ 13 (భద్రాద్రి న్యూస్):-



ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పెన్షన్ పథకం వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, ఇతర అర్హులైన పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని 58వ డివిజన్ కార్పొరేటర్ మొహమ్మద్ దావూద్ పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు అభినందనీయమన్నారు.

ఈ సందర్భంగా చేయూత పెన్షన్ పథకం అమలుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క, మంత్రివర్గ సభ్యులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, నగరపాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్, స్థానిక కార్పొరేటర్లు, ప్రజాసేవలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యంగా 58వ డివిజన్‌లో పెన్షన్ పథకం అమలుకు సహకరించిన డివిజన్ అధికారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా పాలన అంటే ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే కాకుండా, వారి కష్టాల్లో తోడుగా నిలిచి అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమని దావూద్ పేర్కొన్నారు. చేయూత పెన్షన్లతో వృద్ధులు గౌరవప్రదమైన జీవనం సాగించేందుకు, దివ్యాంగులు, వితంతువులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవకాశం కలుగుతోందన్నారు.ప్రజల ఆశీర్వాదాలతో ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రజాసేవే తన లక్ష్యమని, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని మొహమ్మద్ దావూద్ తెలిపారు.

పేదల ఆత్మగౌరవానికి పెన్షన్లు కొండంత అండ

- **అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలి**
- **కార్పొరేషన్‌కు కొత్త రూపునిస్తున్నాం**
- **మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం**
- **అధైర్యపడొద్దు..అందరికీ ఇందిరమ్మ ఇండ్లు, చేయూత పెన్షన్లు అందిస్తాం**
- **కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక**
- **కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 13(భద్రాద్రిన్యూస్)





నిరుపేదలు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగుల ఆత్మగౌరవానికి చేయూత పెన్షన్లు కొండంత అండగా నిలుస్తాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పట్టణంలో నూతనంగా మంజూరైన 1,185 చేయూత పెన్షన్ల మంజూరు పత్రాలను శుక్రవారం కొత్తగూడెం క్లబ్బులో జరిగిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న అభాగ్యుల జీవితాల్లో ఈ పింఛన్లు వెలుగులు నింపుతాయని పేర్కొన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్‌గా రూపాంతరం చెందిన నేపథ్యంలో, నగర అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నామని చెప్పారు. మురుగునీటి వ్యవస్థ, అంతర్గత రహదారులు, తాగునీటి సరఫరా వంటి కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి కార్పొరేషన్‌కు కొత్త రూపు నిస్తామని అన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి నిత్యం అందుబాటులో ఉంటామని భరోసా ఇచ్చారు. సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులకు చేరినప్పుడే వాటికి సార్థకత చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఆర్డీవో మధు, తాసిల్దార్ పుల్లయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్ డిప్యూటీ మేయర్ లలిత కుమారి, ప్రజా ప్రతినిధులు పసుపులేటి వీరబాబు, లాల్ సింగ్, మండే హనుమంతరావు, నాయకులు నాగ సీతారాములు, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, ఎస్ కే ఫహీం, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ కళాశాల మ్యూజియాన్ని సందర్శించిన సర్వజ్ఞ విద్యార్థులు

- **సైన్స్, వృక్ష, జంతు, పురావస్తు విశేషాలపై ఆసక్తిగా పరిశీలన**
- **విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా భావన పెంపొందించడమే లక్ష్యం**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 13(భద్రాద్రి న్యూస్):-

ఖమ్మంలోని ప్రసిద్ధ శ్రీ రామ భక్త గెంటెల నారాయణ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్)లోని సైన్స్, జంతుశాస్త్రం, వృక్షశాస్త్రం, పురావస్తు మ్యూజియాలను సర్వజ్ఞ పాఠశాలకు చెందిన 6 నుంచి 9వ తరగతి విద్యార్థులు సందర్శించారు. ఈ విద్యా సందర్శన విద్యార్థులకు విజ్ఞానదాయకంగా, ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథం, చారిత్రక అంశాలపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో ముఖ్యమన్నారు. సైన్స్ ప్రయోగాలు, వృక్ష, జంతుశాస్త్ర విశేషాలు, ప్రాచీన సంస్కృతిని ప్రతిబింబించే పురావస్తు మ్యూజియం ద్వారా పాఠ్యపుస్తకాల్లో చదివిన అంశాలను ప్రత్యక్షంగా చూసి తెలుసుకునే అవకాశం విద్యార్థులకు లభించిందన్నారు.

పాఠశాల డైరెక్టర్ కె. నీలిమ మాట్లాడుతూ ఇలాంటి విద్యా సందర్శనలు విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు పరిశోధనా ఆసక్తిని పెంపొందిస్తాయని తెలిపారు. మ్యూజియంలోని పురాతన అవశేషాలు, జీవరాశుల నమూనాలు, వృక్షశాస్త్ర విభాగంలోని విశేషాలు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సర్వజ్ఞ విద్యార్థులు పాల్గొన్నారు.





రాష్ట్రస్థాయికి త్రివేణి విద్యార్థుల ప్రాజెక్టు

- **విద్యార్థులుహరిచరణ్,వర్షన్‌లనుఅభినందించినడీఈఓవాసంతి**
- **క్రాప్ రెసిడ్యూటు కెమికల్స్'ప్రాజెక్టుకుజిల్లాస్థాయిలోగుర్తింపు**

ఖమ్మం ప్రతినిధి ,నవంబర్ 13 (భద్రాద్రిన్యూస్):-

32వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైన త్రివేణి పాఠశాల విద్యార్థులు డి. హరిచరణ్, బి. వర్షన్‌లను జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) వాసంతి అభినందించారు. 9వ తరగతి ఇంపాక్ట్ విభాగానికి చెందిన ఈ విద్యార్థులు సాధించిన విజయంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు.

గైడ్ టీచర్ కె. సుధాకర్ మార్గదర్శకత్వంలో విద్యార్థులు రూపొందించిన 'క్రాప్ రెసిడ్యూ టు కెమికల్స్' (పంట వ్యర్థాల నుంచి రసాయనాల తయారీ) ప్రాజెక్టు వినూత్న ఆలోచనలను, విద్యార్థుల పరిశోధనా దృక్పథాన్ని అధికారులు ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాస్, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త వెంకటేశ్వర్లు కూడా విద్యార్థులను అభినందించారు.

విద్యార్థుల ప్రతిభ పాఠశాలకు గర్వకారణమని పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ ప్రతిభ చాటి మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులతో పాటు గైడ్ టీచర్ కె. సుధాకర్‌ను అభినందించారు.





సీ్స బాలుర వసతి గృహాల్లో డీడీ జ్యోతి ఆకస్మిక తనిఖీలు

- **ఫేషియల్ రికగ్నిషన్ హాజరు విధానం అమలుపై పరిశీలన**
- **విద్యార్థులకు అందుతున్న భోజనం, పదో తరగతి విద్యార్థుల చదువుపై ఆరా**

ఖమ్మం ప్రతినిధి , నవంబర్ 13 (భద్రాద్రి న్యూస్):

ఖమ్మం నగరంలోని ఎస్సీ బాలుర వసతి గృహాలను షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా డిప్యూటీ డైరెక్టర్ గుడికందుల జ్యోతి శుక్రవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. నగరంలోని ఎస్సీ బాలుర వసతి గృహం (బి), ఆనంద నిలయం, ఎస్సీ బాలుర వసతి గృహం (సి)లను సందర్శించి అక్కడి నిర్వహణ తీరును పరిశీలించారు.

ఈ సందర్భంగా శాఖలో నూతనంగా ప్రవేశపెట్టిన ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టమ్ (ఎఫ్ఆర్ఏఎస్) అమలు తీరును తనిఖీ చేశారు. విద్యార్థులకు గ్రూపుల వారీగా ముఖ గుర్తింపు ద్వారా హాజరు ఎలా నమోదు చేస్తున్నారో సంబంధిత వసతి గృహ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న భోజన సదుపాయాలను, స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన సరుకులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి వారి చదువులు, విద్యా ప్రగతి, పరీక్షలకు చేస్తున్న సన్నద్ధతపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు బోధన అందించేందుకు నియమించిన ట్యూటర్‌తో మాట్లాడి బోధనా కార్యక్రమాల నిర్వహణపై ఆరా తీశారు. ఈ తనిఖీల్లో సహాయ సంక్షేమ అధికారులు ఎం.డి. అబ్దుల్ రావుఫ్, ఎం. వీరయ్య, గోపీచంద్ నాయక్, వసతి గృహ సంక్షేమ అధికారులు కోటపాటి రుక్మారావు, టీ. స్టాలిన్, ఎన్. రమేష్‌తో పాటు నాలుగో తరగతి సిబ్బంది పాల్గొన్నారు.



మున్నూరుకాపుల ఐక్యతను చాటేలా వన సమారాధన

- **ఈనెల 15న చెరుకూరి వారి మామిడి తోటలో వేడుకలు**
- **కుటుంబ సమేతంగా తరలిరావాలి.. కులబాంధవులకు మున్నూరుకాపు సంఘం నాయకుల పిలుపు**

ఖమ్మం ప్రతినిధి, నవంబర్ 13(భద్రాద్రిన్యూస్):-



జనాభాలో 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు రాజ్యాధికారంలో తగిన ప్రాతినిధ్యం దక్కకపోవడం విచారకరమని మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు శీలంశెట్టి వీరభద్రం, ప్రధాన కార్యదర్శి పసుపులేటి దేవేందర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుల గాంధీ తదితర నాయకులు పేర్కొన్నారు. బీసీలు తమ న్యాయమైన హక్కుల సాధన కోసం, రాజ్యాధికారంలో సముచిత వాటా దక్కించుకునేందుకు మరింత సంఘటితంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

ఈనెల 15వ తేదీ ఆదివారం చెరుకూరి వారి మామిడి తోటలో నిర్వహించనున్న వన సమారాధన ఏర్పాట్ల నేపథ్యంలో శుక్రవారం మున్నూరుకాపు వసతిగృహంలో నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్నూరుకాపుల్లో సామాజిక చైతన్యం పెంపొందించడంతో పాటు ఐక్యత, ఆత్మగౌరవ భావాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో పవిత్ర కార్తీక మాసంలో వన సమారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజకీయాలు, పార్టీలకు అతీతంగా నిర్వహిస్తున్న ఈ వేడుకకు ప్రభుత్వ సలహాదారు వీ. హనుమంతరావు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కోవా లక్ష్మణ్, వద్దిరాజు రవిచంద్ర, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు దానం నాగేందర్, వనమా వెంకటేశ్వరరావు, బాజిరెడ్డి గోవర్ధన్, దాస్యం వినయ్ భాస్కర్, కోరుకంటి చందర్, పుట్టా మధుకర్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, మున్నూరుకాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మా శ్రీరామ్ చక్రవర్తి, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుటం పురుషోత్తమరావు, ప్రధాన కార్యదర్శి పెద్ది పెంటయ్య, అపెక్స్ కౌన్సిల్ చైర్మన్ మీసాల చంద్రయ్య తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు వెల్లడించారు.ఈనెల 15వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకల్లా మమతా మెడికల్ కళాశాల గొల్లగూడెం రోడ్డులోని చెరుకూరి వారి మామిడి తోటకు కులబాంధవులందరూ కుటుంబ సమేతంగా చేరుకోవాలని కోరారు. వన సమారాధనలో పెద్ద సంఖ్యలో పాల్గొని మున్నూరుకాపుల ఐక్యతను మరోసారి చాటిచెప్పాలని పిలుపునిచ్చారు.

ఈ సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు కొత్త సీతారాములు, గౌరవ సలహాదారులు పార నాగేశ్వరరావు, పొదిల రవికుమార్, మెంతుల శ్రీశైలం, పసుపులేటి నాసరయ్య, ఉపాధ్యక్షులు మలిశెట్టి వెంకటేశ్వరరావు, మాటేటి నాగేశ్వరరావు, మడిశెట్టి వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు పార ఉదయ్‌కుమార్, జీవీఎల్ నరసింహారావు, కోనేటి నారాయణ, గుండపునేని నరసింహారావు, వనం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సేవే లక్ష్యం.. సమాజ మార్పే ధ్యేయం!

- **మారుమూల గిరిజన గూడేల నుంచి వృద్ధాశ్రమాల వరకు.. నేషనల్ సేవా ఫౌండేషన్ మానవీయ స్పర్శ**
- **భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మూడు ప్రధాన సామాజిక సేవా కార్యక్రమాలు**
- **గిరిజన కుటుంబాలకు చీరలు, దుప్పట్లు పంపిణీ**
- **పాఠశాల చిన్నారులకు విద్యా సామగ్రి, చిరుతిళ్లు**
- **వృద్ధులకు భోజనం, పండ్లు, దుస్తుల అందజేత**
- **తొమ్మిది ప్రధాన లక్ష్యాలతో సేవా ప్రస్థానం**

కొత్తగూడెం, నవంబర్ 12 (భద్రాద్రి న్యూస్)





:సేవ చేయాలనే సంకల్పం ఉంటే అవకాశాలు వాటంతట అవే వస్తాయి.. సమాజంలో మార్పు తీసుకురావాలనే తపన ఉంటే అడుగులు మారుమూల ప్రాంతాల వైపు సాగుతాయి. ప్రభుత్వ పథకాలు, అధికార యంత్రాంగం తమ వంతు కృషి చేస్తున్నప్పటికీ సమాజంలో ఇంకా ఎన్నో వర్గాలు కనీస అవసరాలకు దూరంగా ఉన్నాయి. అలాంటి వారికి అండగా నిలవాలనే లక్ష్యంతో నేషనల్ సేవా ఫౌండేషన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చేపట్టిన సామాజిక సేవా కార్యక్రమాలు పలువురి ప్రశంసలు అందుకుంటున్నాయి. గిరిజన కుటుంబాలకు ఆప్యాయత పంచడం నుంచి చిన్నారుల విద్యాభివృద్ధికి తోడ్పడటం, వృద్ధులకు అండగా నిలవడం వరకు మూడు విభిన్న కార్యక్రమాలతో మానవీయతను చాటుకుంది.

మారుమూల గిరిజన గూడేలకు ఆప్యాయత

చుంచుపల్లి మండలం పెనగడప గ్రామపంచాయతీ పరిధిలోని మర్రిగూడెం గుంపులో నివసిస్తున్న గిరిజన కుటుంబాలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేయడం ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమాల్లో ప్రత్యేకంగా నిలిచింది. కేవలం 30 కుటుంబాలు మాత్రమే నివసించే ఈ మారుమూల ఆవాసం పట్టణ జీవనానికి దూరంగా ఉంది. కనీస వసతులు, అవసరాల కోసం స్థానికంగా లభించే వనరులపైనే ఆధారపడుతూ జీవిస్తున్న గిరిజన కుటుంబాలకు ఫౌండేషన్ ప్రతినిధులు ఆప్యాయతతో చేయూతనిచ్చారు. వస్తువుల పంపిణీతోనే సేవను పరిమితం చేయకుండా, తదుపరి దశలో గ్రామంలో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం చేయడం విశేషం.

చిన్నారుల చదువుకు ప్రోత్సాహం

పాల్వంచ మండలం కారేగట్టు గ్రామంలోని ప్రీప్రైమరీ పాఠశాల చిన్నారులకు పలకలు, బలపాలు, పుస్తకాలు, చిరుతిళ్లు పంపిణీ చేశారు. బాల్యంలోనే విద్యపై ఆసక్తి పెంపొందించడంతో పాటు పేద కుటుంబాల పిల్లలకు చదువుకు అవసరమైన ప్రాథమిక సామగ్రి అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు నింపడమే కాకుండా, వారి విద్యాభివృద్ధికి సామాజిక సంస్థలు కూడా బాధ్యత తీసుకోవాలనే సందేశాన్ని ఫౌండేషన్ చాటింది.

వృద్ధులకు ఆత్మీయ భరోసా

అశ్వాపురం మండలంలోని వృద్ధాశ్రమంలో నివసిస్తున్న వృద్ధులకు భోజనం సమకూర్చడంతో పాటు పండ్లు, చిరుతిళ్లు, దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. కుటుంబాలకు దూరమై వృద్ధాశ్రమాల్లో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు ఆహారం అందించడం మాత్రమే కాకుండా, వారితో ఆత్మీయంగా గడుపుతూ ఆదరణ చూపడం ఈ కార్యక్రమంలో మానవీయ కోణాన్ని ఆవిష్కరించింది. షానాజ్ తన సొంత ఆర్థిక వనరులతో ఈ వృద్ధాశ్రమాన్ని నిర్వహిస్తూ వృద్ధులకు ఆశ్రయం, ఆలనాపాలనా అందిస్తుండటం అభినందనీయమని ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు.

తొమ్మిది లక్ష్యాలతో సేవా ప్రస్థానం

ఈ సందర్భంగా నేషనల్ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు చిన్ని బాబు అరిగెల మాట్లాడుతూ.. జిల్లాలో చేపట్టిన ఈ కార్యక్రమాలు తమ సేవా ప్రయాణంలో తొలి అడుగులని తెలిపారు. సమాజంలోని అవసరంలో ఉన్న ప్రతి వర్గానికి చేరువ కావడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. విద్య, బాలల అభివృద్ధి, దివ్యాంగులు, వృద్ధులకు సహాయం, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్య సంరక్షణ, యువతకు ఉపాధి నైపుణ్యాలు, మాదకద్రవ్యాల నివారణ, సేంద్రియ వ్యవసాయం, సామాజిక న్యాయం, మానవ హక్కుల పరిరక్షణ వంటి తొమ్మిది ప్రధాన అంశాలపై ఫౌండేషన్ పనిచేస్తుందని వివరించారు.

సమష్టి కృషితో సామాజిక మార్పు

ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఛైర్మన్ డాక్టర్ పి. శ్రీనివాసులు భరత అవినీతి నిరోధక, విజిలెన్స్ కౌన్సిల్ తెలంగాణ చీఫ్‌గా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రధాన కార్యదర్శి కనూరు శ్రీనివాస్‌తో కలిసి సంస్థ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు. ట్రస్టీలుగా ఎం.కె. సిను, డాక్టర్ కె.వి.వి. వినీత, జి.ఎస్. జయధీర్, ఎం. జాన్ అరుల్, ఎస్. వీరభద్రరావు వ్యవహరిస్తున్నారు. న్యాయవాదులు ఈ. చంద్రకాంత్, మదన్ మోహన్, సింగం శ్రీధర్‌తో పాటు పి. గణేష్, దుర్గ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు.

సేవా కార్యక్రమాలే సామాజిక బాధ్యతకు నిదర్శనం

సమాజంలో వెనుకబడిన వర్గాలకు ప్రభుత్వ సహాయంతో పాటు స్వచ్ఛంద సంస్థల తోడ్పాటు కూడా ఎంతో అవసరం. ముఖ్యంగా మారుమూల గిరిజన ప్రాంతాల్లో విద్య, వైద్యం, కనీస అవసరాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో నేషనల్ సేవా ఫౌండేషన్ చేపట్టిన కార్యక్రమాలు సేవా సంస్థల సామాజిక బాధ్యతను గుర్తుచేస్తున్నాయి. ఒక్కరోజు కార్యక్రమాలతో సరిపెట్టకుండా భవిష్యత్తులోనూ నిరంతర సేవా కార్యక్రమాలు నిర్వహిస్తే మరింత మంది నిరుపేదలకు ప్రయోజనం చేకూరనుంది. నేడు సేవ.. రేపటి సాధికారత" (Service Today, Empowering Tomorrow)* అనే నినాదంతో సమాజంలో అర్థవంతమైన మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొంటున్నారు. సేవను బాధ్యతగా, సమాజ అభివృద్ధిని ధ్యేయంగా చేసుకుని నేషనల్ సేవా ఫౌండేషన్ సాగిస్తున్న ప్రస్థానం అభినందనీయం.